# ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి శివలింగయ్య
- అధికారులకు దిశానిర్దేశం



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ చౌరస్తా, అక్టోబర్ 27 : జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివలింగయ్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఎన్నికల నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, రిస్క్ మేనేజ్‌మెంట్ టీమ్ సభ్యులతో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, సుహాసినితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 30న నిర్వహించే ఎన్నికలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు ఎన్నికల సామగ్రి పంపిణీ చేయాలని సూచించారు. పంపిణీ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి అవసరమైన వసతులు సమకూర్చాలని తెలిపారు. ఎన్నికల విధులను నిర్వహించే సిబ్బందిని తరలించడానికి బస్సులు సిద్ధంగా ఉంచుకోవాలని, రూట్‌ల వారీగా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఎన్నికలు నిర్వహించే రోజు పోలింగ్ బూత్‌ల్లో సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎపిక్ కార్డుతో పాటు 12 రకాల ప్రభుత్వ గుర్తింపు కార్డులను ఓటర్లు తమ వెంట తీసుకొచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అంధులు, 80 ఏళ్ల పైబడిన వారు, పోస్టల్ బ్యాలెట్ వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో 19 నిమిషాల ముందు ఎన్నికల నిబంధనల ప్రకారం మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. జిల్లా అధికారులు రిస్క్ మేనేజ్‌మెంట్ టీమ్ సభ్యులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ జరిగేలా చూడాలన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, విచారణ కేంద్రాల్లో సిబ్బందిని నియమించి భద్రతా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ రోజున ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచార నివేదికలు పంపించాలన్నారు. ఈ సమావేశంలో అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మురళీ కృష్ణ, రామ్మూర్తి, నోడల్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



బచ్చన్నపేట : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఎం వినీత, ఏపీఎం నాగేశ్వర్‌రావు



నర్మెట : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం రవి

# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- రైతులు దళారులను ఆశ్రయించొద్దు
- డీపీఎం వినీత
- పలు గ్రామాల్లో కేంద్రాలు ప్రారంభం

బచ్చన్నపేట, అక్టోబర్ 27 : రైతులు పంటల గిట్టుబాటు ధర కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని, అందులోనే రైతులు ధాన్యం విక్రయించాలని జనగామ డీపీఎం వినీత సూచించారు. శుక్రవారం మండలంలోని బచ్చన్నపేట, చిన్నరామన్‌చర్ల, పోచన్నపేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆమె ఏపీఎం నాగేశ్వర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు బాగుండాలన్నదే సర్కారు లక్ష్యమన్నారు. ఏ గ్రేడ్ క్వింటాల్‌కు రూ. 2,203, సాధారణ రకానికి రూ. 2,183 ధరను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కేంద్రాలకే ధాన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు యాదలక్ష్మి, లలిత, ఉమారాణి, మంగ, చైతన్య, సీసీలు విజయలక్ష్మి, నర్సింహులు, సత్యనారాయణ, పోచన్నపేటలో సీసీ తిరుమల, రమాదేవి, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామాల్లో సీఈవో బాలస్వామి, సిబ్బంది ఆధ్వర్యంలో కేంద్రాలు ప్రారంభించారు.

### నర్మెటలో..

నర్మెట : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యం విక్రయించాలని ఐకేపీ ఏపీఎం మాదారపు రవి అన్నారు. మండలంలోని హన్మంతాపూర్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ.2,203, సాధారణ రకం రూ.2,183లు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఈవో భూక్యా అనిత, సీసీలు కవిత, యాదగిరి, కుమార్, గ్రామైఖ్య సంఘం సభ్యులు, పంచాయతీ కార్యదర్శి యాకూబ్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన బస్సు

- బస్సు డ్రైవర్ మృతి, 12 మందికి గాయాలు
- యశ్వంతాపూర్ గ్రామంలో ఘటన

జనగామ రూరల్, అక్టోబర్ 27 : హనుమకొండ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ రాజధాని బస్సు జనగామ మండలంలోని యశ్వంతాపూర్ గ్రామం దాటిన తర్వాత మొక్కలకు నీరు పడుతున్న వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ యాదగిరి మృతి చెందగా 12 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. యశ్వంతాపూర్‌లో జాతీయ రహదారిపై మొక్కలకు నీరుపడుతున్న వాటర్ ట్యాంకర్‌ను బస్సు వెనుక నుంచి ఢీకొంది. పోలీసులు ఘటన ప్రదేశానికి చేరుకొని గాయపడిన ప్రయాణికులు, బస్సు డ్రైవర్‌ను జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. చికిత్స పొందుతూ డ్రైవర్ యాదగిరి మృతి చెందాడు. మిగతా ప్రయాణికులు అలేఖ్య, నవీన్, రామ్, గణేశ్, అశోక్, మంజుల చికిత్స పొందుతున్నారు. స్వల్పగాయాలైన చికిత్స అనంతరం వెళ్లిపోయారు. ఇందులో స్వరూపకు కాలు విరగడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. జనగామ డిపో మేనేజర్ ప్రయాణికులను పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

యశ్వంతాపూర్‌లో వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన రాజధాని బస్సు





జనగామ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికులు



గర్భిణులకు కేసీఆర్ కిట్లను అందిస్తున్న వైద్యాధికారి శ్రీతేజ

## కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

జనగామ చౌరస్తా, అక్టోబర్ 27 : ధర్మకంచలోని పీహెచ్‌సీలో శుక్రవారం 30 మంది గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీతేజ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పోషకాహార కిట్‌లోని పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కిట్ వినియోగంతో రక్తహీనతను అధిగమించే అవకాశం ఉంటుందని తెలిపారు. వైద్యాధికారుల ఆరోగ్య సలహాలను పాటిస్తూ సుఖ ప్రసవం కోసం మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)కు వెళ్లాలని డాక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి రెహమాన్, సిబ్బంది లావణ్య, నీలిమ, ఉపేంద్ర, అనిత, స్వప్న, మంగ తదితరులు పాల్గొన్నారు.



వైష్ణవికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎర్రోజు శ్రీనివాస్

## ఆర్థిక సాయం అందజేత

జనగామ చౌరస్తా, అక్టోబర్ 27 : జిల్లా కేంద్రంలోని గీతా నగర్ జడ్పీ పాఠశాలలో శుక్రవారం తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ తరిగొప్పుల గ్రామానికి చెందిన దివంగత కవి జంగ వీరయ్య కుమార్తె వీర వైష్ణవికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. చదువులో ప్రతిభ కనబరుస్తున్న వైష్ణవి డిగ్రీ చదువు పూర్తయ్యేంత వరకు ఏడాదికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తానని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు పానుగంటి రామ్మూర్తి, ఉపాధ్యాయులు బానోత్ రవీందర్, హిమబిందు, షఫీ మహ్మద్, అబిద్ హుస్సేన్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మధు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సంపత్‌రెడ్డి

## మృతుడి కుటుంబానికి పరామర్శ

జనగామ రూరల్, అక్టోబర్27: మండలంలోని వెంకిర్యాల గ్రామానికి చెందిన కీర్తి మధు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. మధు మృతదేహానికి జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల కళింగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరి గౌడ్, సర్పంచ్ కీర్తి లక్ష్మీనర్సయ్య, గ్రామ అధ్యక్షుడు తాళ్లపల్లి అశోక్, మాజీ సర్పంచ్ దండు సత్యనారాయణ, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### కౌన్సిలర్ కుటుంబానికి..

జనగామలోని 13వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళ రాజు కుటుంబాన్ని శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పొన్నాల లక్ష్మయ్య పరామర్శించారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు తన కార్యాలయంలో బీఆర్ఎస్ శ్రేణులతో పొన్నాల సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ నాయకులు ధర్మపురి శ్రీనివాస్, మాజిద్, సౌడ మహేశ్, పిట్టల రాజేశ్, సోషల్ మీడియా పట్టణ ఇన్‌చార్జి రాజు, ప్రసాద్, వెంకటస్వామి, ఉపేందర్, మల్లేశ్ పాల్గొన్నారు.